సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం: 20. మే. 2024



సోమశిలలో 7.716 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 7.716 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.76,450
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,847
3 శాతం జీఎస్టీతో	రూ.7,052
నవర (8గ్రా)	రూ.56,416



నేరాల నియంత్రణే లక్ష్యంగా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాల్లేని 64 మోటార్‌బైక్‌లు, రెండు ఆటోలు, 89 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు పాతనేరస్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డితో చర్చిస్తున్న జేసీ ఎస్.సేతుమాధవన్

వెంకటాచలం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల 22న వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ పర్యటనకు రానున్నారు. ఈ మేరకు వీఎస్‌యూలో చేస్తున్న ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డితో చర్చించి పలు సూచనలు చేశారు.

వీవ్ ఆఫ్ కల్చర్ షార్ట్ ఫిల్మ్‌కు అవార్డుల పంట



అమెరికాలో స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకుంటున్న మావూరి సంతోష్‌రామ్

నెల్లూరు(బృందావనం): చేనేత చీరల పరిశ్రమ వైభవం వెనుక జరిగే కష్టనష్టాలను ప్రతిబింబించే అంశాలకు దృశ్యరూపకం ఇస్తూ మావూరి సంతోష్‌రామ్ నిర్మించిన 'వీవ్ ఆఫ్ కల్చర్' షార్ట్ ఫిల్మ్ పలు అవార్డులను దక్కించుకుంది. చందన, సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు కుమారుడు మావూరి సంతోష్‌రామ్ ఆదివారం వివరాలు వెల్లడించారు. అమెరికా లాస్‌ఏంజిల్స్‌లోని న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో ఫిల్మోగ్రఫీలో డిగ్రీ పూర్తి చేసుకుని తానే నిర్మాతగా, దర్శకుడిగా చేనేత పరిశ్రమలోని కష్ట నష్టాలను ప్రపంచానికి తెలియజేస్తూ 'వీవ్ ఆఫ్ కల్చర్' పేరుతో షార్ట్ ఫిల్మ్‌ను నిర్మించానన్నారు. అనేక ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఈ షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించడంతో పలు అవార్డులు లభించాయన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 8వ దాదా సాహెబ్‌ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఉత్తమ జ్యూరీ అవార్డు దక్కిందన్నారు. అమెరికాలో బోస్టన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్పెషల్ జ్యూరీ అవార్డు, యూఎస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు, సెంట్రల్ మిచ్గాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్పెషల్ జ్యూరీ అవార్డులు వచ్చాయన్నారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఐదు వేలకు పైగా లఘుచిత్రాలు ప్రదర్శితమయ్యాయన్నారు.

అంగరంగ వైభవం.. అలఘునాథుని కల్యాణం



అలఘునాథ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేత అలఘునాథస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రత్యేక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి వేంచేపు చేశారు. శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాలను వివరిస్తూ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పోలీస్ విధులు కత్తిమీద సాము



ట్రైయినీ డీఎస్పీ హేమలతను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

కోవూరు: పోలీస్ విధులు కత్తిమీద సాముతో కూడిందని శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీ ఎం.హేమలత అన్నారు. ఐదు నెలల క్రితం కోవూరు సర్కిల్‌లో సీఐ విధుల్లో శిక్షణ పొందారు. ఆదివారం ఆమె సీఐ హోదా శిక్షణ పూర్తికావడంతో స్థానిక సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రైయినీ డీఎస్పీని సత్కరించారు. ఆమె మాట్లాడుతూ పోలీస్‌శాఖకు సంబంధించి అన్ని విషయాలను కూలంకషంగా తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ శాఖలో కొన్ని కీలకమైన కేసుల విషయాల్లో సీనియర్లతో పాటు జూనియర్ల సూచనలు ఎంతో ఉపయోగపడుతాయని తెలుసుకున్నట్లు వివరించారు. సీఐలు సుబ్బారావు హైమారావు, ఎస్‌ఐలు రంగనాథ్‌గౌడ్, వీరేంద్ర, సెబ్ సీఐ ప్రసాద్‌రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నోట్లకు ఓట్లు పడ్డాయా!

పోలింగ్ సరళిపై టెన్షన్‌లో టీడీపీ అభ్యర్థులు

- ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.వందల కోట్లు ఖర్చు
- గెలుపు ధీమా లేక.. ఓట్ల కొనుగోలు
- డబ్బు ప్రభావం ఎంత మేరకు..
- బూత్‌ల వారీగా సమీక్షించుకుంటున్న నేతలు

సార్వత్రిక పోలింగ్ ముగిశాక.. పోలింగ్ సరళిపై సమీక్షించుకుంటున్న టీడీపీ అభ్యర్థులు టెన్షన్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. క్షేత్రస్థాయిలో గెలుపు ధీమా లేకపోవడంతో ఒక్కొక్క నియోజకవర్గంలో రూ.వందల కోట్లు ఖర్చు చేశారు. ప్రధానంగా జిల్లాలో టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి మొదటి స్థానంలో ఉండగా, కోవూరు అభ్యర్థి రెండో స్థానంలో నిలుస్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లో సైతం రూ.70 కోట్ల నుంచి రూ.90 కోట్లు వరకు ఖర్చు చేసినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే పోలింగ్ సరళిపై విశ్లేషిస్తున్న రాజకీయ పండితులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నట్లు చెబుతుండడంతో డబ్బు ప్రభావం ఎంత మేరకు పనిచేసింది.. ఎన్ని ఓట్లు పడి ఉంటాయి.. అని బూత్‌ల వారీగా టీడీపీ నేతలు లెక్కలు వేస్తున్నట్లు సమాచారం.



సాక్షిప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక పోలింగ్ సరళి ప్రధాన పార్టీలతో పాటు రాజకీయ విశ్లేషకులకు సైతం అంతుచిక్కడం లేదు. అయితే వైఎస్సార్‌సీపీ మాత్రం పోలింగ్ తమకు అనుకూలంగా ఉందనే ధీమాతో ఉంటే.. క్షేత్రస్థాయిలో గెలుపు ధీమా లేక ఓట్ల కొనుగోలును నమ్ముకుని రూ.వందల కోట్లు కుమ్మరించిన టీడీపీ నేతల్లో గుబులు రేపుతోంది. క్షేత్రస్థాయిలో టీడీపీ అభ్యర్థులు పంపిణీ చేసిన నోట్లకు ఎంత మేరకు ఓట్లు పడ్డాయనే లెక్కలు తేల్చే పనిలో బూత్‌ల వారీగా సమీక్షిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను, ప్రజాస్వామ్యాన్ని టీడీపీ అపహాస్యం చేసింది. మొదటి నుంచి ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు ప్రజలపై నమ్మకం లేదు. కేవలం ఎన్నికల రోజు డబ్బులు ఇస్తే ఓట్లు పడతాయనే ఆలోచనతో రాజకీయాలను వ్యాపారంగా మార్చేశా రు. క్షేత్రస్థాయిలో ప్రజాబలం ఉన్నప్పటికి తమను అభిమానించే ఓటర్లు ఎక్కడ టీడీపీ ప్రలోభాలకు గురవుతారని ప్రత్యర్థి పార్టీలు సైతం టీడీపీ అభ్యర్థులతో పోటీపడి డబ్బులు పంపిణీ చేయలేక చతికిలపడ్డాయి.

టీడీపీ అభ్యర్థులందరూ ఆగర్భ శ్రీమంతులే

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఆగర్భ శ్రీమంతులే. టీడీపీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య కావడంతో దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న వారిని కాదని కోటీశ్వరులను ఎంపిక చేసి టికెట్లు ఇచ్చింది. జిల్లాలో నెల్లూరు సిటీ, సర్వేపల్లి మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో పార్లమెంట్ సహా కొత్త వారిని బరిలోకి దింపింది. ఎన్నికల్లో గెలవడానికి టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. ముఖ్యంగా కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోసం దాదాపు రూ.120 కోట్లపై మాటగా ఖర్చు చేశారని సమాచారం. నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ రూ.150 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రూ.90 కోట్ల నుంచి రూ.70 కోట్లు ఖర్చు చేసిన మూడు, నాలుగు స్థానాల్లో మిగతా నియోజకవర్గాలు ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది.

పోలింగ్ సరళిపై చర్చ

ఈ దఫా ఎన్నికల సరళిని పరిశీలిస్తే విభిన్నంగా ఉంది. గతంలో ఉదయం 9 గంటల తర్వాత కానీ పోలింగ్ ప్రక్రియ ఊపందుకునేది కాదు. కానీ ఈ దఫా ఉదయం పోలింగ్ సమయానికి అర్ధగంట ముందు నుంచే ఓటర్లు బారులు తీరడం విశేషం. ప్రత్యేకించి మహిళలు బారులు తీరి ఓట్లు వేయడం, గత ఎన్నికల్లో కంటే పోలింగ్ శాతం పెరగడం కూడా టీడీపీ అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రధానంగా అధికార వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చింది. అదే టీడీపీ గతంలో హామీల పేరుతో మహిళలను, రైతులను, నిరుద్యోగులను.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదు.. ప్రతిపక్ష టీడీపీపై ప్రజల్లో సానుకూలత కూడా లేదు. ఈ దఫా ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్, ఊహించని విధంగా సాగిన పోలింగ్ సరళి అభ్యర్థులకే కాకుండా.. రాజకీయ విశ్లేషకుల ఊహలకు కూడా అందడం లేదు. అయితే రాజకీయ విశ్లేషకులు మాత్రం కచ్చితంగా వైఎస్సార్‌సీపీకే ఓట్లు పడ్డాయనే విశ్లేషణలు చేస్తుండడంతో టీడీపీ అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. రూ.వందల కోట్లు ఖర్చు చేసినా.. ఓట్లు పడలేదనే అంచనాలతో ఇప్పుడు బూత్‌ల వారీగా లెక్కలు వేస్తున్నారు. ఆయాల బూత్‌ల్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి.. ఎంత డబ్బు పంపిణీ చేశాము.. మనకు ఎన్ని ఓట్లు పడి ఉంటాయనే లెక్కలు తేల్చే పనిలో తలమునకలై ఉన్నారు.

అసలు ఓటర్లకు డబ్బు చేరడంపై ఆరా..

పోలింగ్ సరళిపై రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చల్లో అసలు ఓటర్లకు ఎంత మేర డబ్బు చేరిందని అభ్యర్థులు ఆరా తీస్తున్నారని సమాచారం. అభ్యర్థులు ఇచ్చిన డబ్బులను ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు పంచుకోగా మిగిలిన మొత్తాలను ఓటర్లు పంచినట్లు జరుగుతున్న ప్రచారంపై కూడా అభ్యర్థులు లెక్కలు అడుగుతున్నారంట. స్థానిక నేతలు ఎవరెవరు ఓట్లు వేశారు.. ఎవరు వేయలేదు.. ఆరా తీస్తూ తిరిగి డబ్బులిస్తే.. అభ్యర్థులకు లెక్కలు చెప్పాలంటూ ఓటర్లను బెదిరిస్తున్నారు. ఇటీవల కావలి, నెల్లూరు సిటీ ప్రాంతాల్లో ఓటర్లకు పంచిన డబ్బులు తిరిగి ఇవ్వమని స్థానిక లీడర్లు ఒత్తిడి చేస్తున్నట్లు లైవ్ వీడియో, ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

నిశిరాత్రి మృత్యుకేక

- మృత్యు శకటంగా మారిన ఆగి ఉన్న లారీ
- నెల్లూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కనిగిరి వాసులు ఇద్దరు మృతి
- మృతులు దూరపు బంధువులు
- మరొకరి పరిస్థితి విషమం
- ఇంకో ఐదుగురికి తీవ్ర గాయాలు
- నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణం

అర్ధరాత్రి దాటిన తర్వాత నిశిరాత్రి నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై మృత్యు కేకలు, ఆర్తనాదాలు, హాహాకారాలు మిన్నంటాయి. చీకట్లో వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికులందరూ గాఢ నిద్రలో ఉన్నారు. బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొని ఒక్క కుదుపునకు గురైంది. గాఢనిద్రలో ఉన్న బస్సులోని ప్రయాణికులందరూ ఉలిక్కిపడి లేచేసరికి ఏమి జరిగిందో తెలియని పరిస్థితి. ప్రయాణికులందరూ ఒకరిపై ఒకరు పడిపోయారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం అదిరిపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ఇంకొందరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



బస్సులో మృతులు, క్షతగాత్రులు





మృతులు వేమవరపు డేవిడ్, వేమవరపు మరియమ్మ



క్షతగాత్రురాలు వేమవరపు విశ్రాంతమ్మ

కనిగిరిరూరల్/వెలిగండ్ల: ఆర్టీసీ డ్రైవర్ నిద్రమత్తు.. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం రెండు కుటుంబాల్లో బిడ్డలను అనాథలను చేసింది. మరి కొన్ని కుటుంబాల్లో ఆందోళన నింపింది. అందరూ సొంతూర్లలో శుభకార్యాలు, ఇతర పనులు, ఓటు వేసేందుకు వచ్చారు. బతుకుదెరువు కోసం తాను వలస వెళ్లిన చెన్నైకు తిరిగి వెళ్తూ ఒకరు, మనుమరాలు రమ్మందని చూడటానికి వెళ్తూ మరొకరు మృత్యు ఒడికి చేరుకోగా, మరికొందరు క్షతగాత్రులై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు సమీపంలో కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ అల్ట్రా డీలక్స్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 1.15 గంటల సమయంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో కనిగిరి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. మృతులు ఇద్దరూ దూరపు బంధువులు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో కంకణంపాడుకు చెందిన గంధం అరుణ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వెలిగండ్ల మండలం మరపగుంట్లకు చెందిన సలోమి, రవికుమార్, సీఎస్‌పురం మండలం ఆర్‌కేపల్లికి చెందిన వీ నాగయ్య, రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సు ఎడమ వైపు లారీ ఢీకొని దూసుకెళ్లడంతో ఆ వరుస సీట్లలో కూర్చొన్న వారే ప్రమాదానికి గురయ్యారు.

గృహప్రవేశానికి వచ్చి వెళ్తూ మృత్యులోకానికి..

వెలిగండ్ల మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన వేమవరపు మరియమ్మ (46)కు ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో ముగ్గురికి వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడికి వివాహం కాలేదు. భర్త సుదర్శనం ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి మరియమ్మ చెన్నైలోని ఓ కాలేజీలో పని చేస్తూ ముగ్గురు పిల్లలను పోషిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెలిగండ్లకు వచ్చి తిరిగి చెన్నైకి వెళ్లింది. మళ్లీ కనిగిరి మండలం మాచవరంలో తన చిన్నాన్న కుమార్తె గృహ ప్రవేశానికి వచ్చి తిరిగి వెళ్తూ ఉండగా ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. బస్సు ప్రమాదంలో మరియమ్మ అక్కడికక్కడే చనిపోయింది. మరియమ్మ ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అనాథలుగా మారారు. దీంతో రామగోపాలపురం, గన్నవరంలో ఉన్న వారి బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మనుమరాలు చెన్నైకు రమ్మందని..

బస్సు ప్రమాదంలో వెలిగండ్ల మండలం కంకణంపాడు గ్రామానికి చెందిన వేమవరపు డేవిడ్ (50) మృత్యువాత పడ్డాడు. అతని భార్య విశ్రాంతమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె చికిత్స పొందుతోంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం అయి చెన్నైలో ఉంటోంది. కుమారుడు ఎలీషాకు వివాహం కాలేదు. తల్లి దండ్రుల వద్ద ఉంటున్నాడు. జీవనోపాధి కోసం వేమవరపు డేవిడ్, మరియమ్మ, ఎలీషా హైదరాబాద్‌లో బేల్దారి పనిచేసుకుంటున్నారు. ఓటు వేసేందుకు వీరు కంకణంపాడు వచ్చారు. చెన్నైలో ఉంటున్న మనుమరాలు తాతను, అమ్మమ్మను చెన్నైకి రమ్మని పిలిచిందని వీరిద్దరూ చెన్నై బయలుదేరారు. ఇంతలో మృత్యువు ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. డేవిడ్ మృతి, మరియమ్మకు తీవ్రగాయాలు కావడంతో కంకణంపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.



కోవూరు: ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

ఊరూరా బెట్టింగ్ మేనియా

- ఒక్క పొదలకూరులోనే రూ.10 కోట్లు
- కూడికలు, తీసివేతల్లో నాయకుల బిజీబిజీ
- పక్క జిల్లాల నుంచి పందేలు కాస్తున్న వైనం



పొదలకూరు : 'మీ పార్టీ గెలుస్తుందా? మా పార్టీ గెలుస్తుందని? మీకెంత మెజార్టీ.. మాకింత మెజార్టీ .. మీ అభ్యర్థి గెలుస్తాడా? మా అభ్యర్థి గెలుస్తాడని..' ఇలా ఒక్కొక్కదానిపై జోరుగా పందేలు జరుగుతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో మెజారిటీ, గెలుపోటములపై ఇప్పటికే రూ.కోట్లలో బెట్టింగ్‌లు పెట్టేశారు. ఇప్పటికీ బెట్టింగ్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా మండలాల వారీగా మెజారిటీలు, అభ్యర్థుల గెలుపోటములు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై పందేలు కాస్తున్నారు. అయితే గ్రామాల్లో కొందరు బూత్‌లెవల్లో కూడా బెట్టింగ్‌లకు పాల్పడుతుండడం విశేషం. ఇలాంటి పందేలను పరిశీలిస్తే గ్రామ స్థాయిలో సైతం ఎంత ప్రతిష్ఠాత్మకంగా ఎన్నికలు జరిగాయో చెప్పవచ్చు. రెండు రోజుల క్రితం టీడీపీ నాయకులు పొదలకూరు మండలంలో సర్వే నిర్వహించి వైఎస్సార్‌సీపీకే మెజారిటీ వస్తుందని తేల్చినట్టుగా తెలుస్తోంది. అయితే మిగిలిన మండలాల్లో తమకు మెజారిటీ వస్తుందని ప్రచారం సాగిస్తూ బెట్టింగులకు పాల్పడుతున్నారు. అయి తే పొదలకూరు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా కవ్వింపు చర్యలకు పాల్పడుతూ బెట్టింగ్‌లకు పిలుస్తున్న వారితో తలపడి పందేలు కాస్తున్నా రు. ఈ నేపథ్యంలో కాకాణి గెలుపు, మెజారిటీ, పొదలకూరు మండల మెజారిటీలపై పందేలు కాశారు. ఇప్పటికే మండలం నుంచి సుమారు రూ.10 కోట్లు బెట్టింగ్‌ల రూపంలో పెద్ద మనుషుల వద్దకు నగదు చేరినట్టుగా తెలుస్తోంది.

పక్కజిల్లాల నుంచి పందేలు

పక్క జిల్లాల నుంచి కూడా సర్వేపల్లి మెజారిటీ, గెలుపోటములపై పందేలు వస్తున్నాయి. ఫోన్లలో మాట్లాడుతూ కొందరు పెద్ద మనుషుల ద్వారా బెట్టింగులకు ఆహ్వానిస్తున్నా.. ఇది టీడీపీ మైండ్ గేమ్‌గా వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన యువకులు బెట్టింగ్ మైండ్ గేమ్ ఆడుతున్న వారి మధ్యవర్తుల ద్వారా ఆహ్వానిస్తున్నారు. ఎంతైనా పందెం కాస్తామని మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, సర్వేపల్లిలో కాకాణి హ్యాట్రిక్ సాధిస్తారని సవాల్ చేస్తున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు పటిష్ట భద్రత



స్ట్రాంగ్‌రూమ్ వద్ద గట్టి బందోబస్తు



స్ట్రాంగ్‌రూమ్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్‌కు మరో పదిహేను రోజులు ఉంది. ఓ వైపు ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత కల్పిస్తూ.. మరో వైపు కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో కలిసి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, నెల్లూరు పార్లమెంట్‌కు సంబంధించి ఈవీఎంలను నగరంలోని ప్రియదర్శిని కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సూచనలతో స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాలతో పాటు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మరో వైపు కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ హాల్‌కు నిరంతర విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా కౌంటింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉండేలా అధికారులు, కౌంటింగ్‌కు సంబంధించి సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద పార్టీ ప్రతినిధులు కూడా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. పార్టీ ప్రతినిధులకు కౌంటింగ్ ఏజెంట్ల ఏర్పాట్లు చేసుకునేలా తగు సూచనలు అందజేశారు. స్ట్రాంగ్‌రూమ్‌లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు కూడా తరచూ పరిశీలిస్తున్నారు. తుది దశ అయిన కౌంటింగ్ ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేసేలా జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వైభవంగా వేదగిరిలో బ్రహ్మోత్సవాలు



చప్పర ఉత్సవ గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు సిటీ: మండలంలోని వేదగిరి క్షేత్రంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం చప్పర ఉత్సవం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాలు జరిగాయి. ప్రధాన అర్చకులు భాస్కరా చార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైదిక కార్యాలు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాలకు కొత్తపాళెంకు చెందిన బసిరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, సురేష్‌రెడ్డి, ఆమంచర్లకు చెందిన నెట్టెం చిరంజీవి, భాస్కర్, రాజారావు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఈఓ వీ గిరికృష్ణ పర్యవేక్షించారు. దేవస్థానం గోశాలలోని గోవుల సంరక్షణకు సద్గురు యోగా అసోసియేషన్ దాతల సహకారంతో 8 గరుకు స్తంభాలు ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేటకు చెందిన కవిత నృత్య ప్రదర్శన, వేగూరు లక్ష్మీ శ్రేష్ఠ కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించాయి.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో క్యూలైన్ ఆక్టోపస్ బిల్డింగ్ వరకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 90,721 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 50,599 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.28 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉన్న వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

క్లుప్తంగా

ఆనకట్టలో శిశువు మృతదేహం

ఉదయగిరి: పట్టణంలోని ఆనకట్టలో శిశువు మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో సీఐ వి.గిరిబాబు, ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి విచారణ చేపట్టారు. ఆర్లపడియ ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళ కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లింది. కాన్పు సమయంలో బిడ్డ చనిపోవడంతో వారు ఇంటికి వెళ్లిపోయారు. వైద్యశాల వారు అక్కడి సిబ్బందికి శిశువు మృతదేహాన్ని పూడ్చి పెట్టాలని చెప్పడంతో ఆనకట్టలో పడేసినట్లు తేలింది.

పిడుగు పడి గేదె మృతి

సీతారామపురం: పిడుగు పడి గేదె మృతిచెందింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామ మందాకృష్ణానగర్ కాలనీలో భూతపాటి రామయ్యకు గేదె ఉంది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో రామయ్య ఇంటి పక్కన వేపచెట్టుకు కట్టేసిన గేదె పిడుగుపాటుకు మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

నిప్పు పెట్టడంతో రూ.3.50 లక్షల నష్టం



ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లెలో గుడిసెకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ప్రాంతంలో నిప్పుపెట్టారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలో గుడిసెలో అన్నపూర్ణాదేవికి పూజలు చేస్తున్నారు. ప్రతి శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అందులోని వస్తువులు కాలిపోయాయి. రూ.3.50 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఎస్సై కర్నాటి ఇంద్రాసేనారెడ్డి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

ఇంటికెళ్తుండగా..

- బైక్ ఢీకొని వివాహిత మృతి



నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ ఢీకొని వివాహిత మృతిచెందిన ఘటన ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. నగరంలోని వెలగచెట్టు సంఘానికి చెందిన సురేష్, లక్ష్మి (21) దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. సురేష్ పెయింట్ పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. లక్ష్మి ఆదివారం తన తండ్రి సుబ్రహ్మణ్యంతో కలిసి స్కూటీపై కోవూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని జాతీయ రహదారిపై ఇంటికి బయలుదేరారు. ఎస్వీజీఎస్ కళాశాల సమీపానికి వచ్చేసరికి వెనక నుంచి స్కూటీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా ఆమె తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. లక్ష్మి మృతదేహాన్ని శవపరీక్ష నిమ్మితం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యంగా..

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
- పోలీసుల అదుపులో ఇద్దరు పాతనేరస్తులు
- 64 మోటార్‌బైక్‌లు, 89 మద్యం బాటిళ్ల స్వాధీనం



తనిఖీ చేస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న మోటార్‌బైక్‌లతో పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలతో శివారు ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేయడంతోపాటుగా నేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం నెల్లూరు నవాబుపేట పోలీసుస్టేషన్, కావలి ఒకటి, రెండు, కావలి రూరల్, బిట్రగుంట, ఉదయగిరి, వింజమూరు పోలీసుస్టేషన్ల పరిధిలో అధికారులు తెల్లవారుజాము నుంచే కార్డన్ సెర్చ్‌లు నిర్వహించారు. సరైన పత్రాల్లేని 64 మోటార్‌బైక్‌లు, రెండు ఆటోలు, 89 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు పాతనేరస్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఎందుకంటే..

దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారితో పాటు విదేశాలకు చెందిన అనేకమంది విద్య, ఉపాధి నిమిత్తం జిల్లాకు వస్తున్నారు. నగర, పట్టణ శివార్లు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయి. నూతనంగా కాలనీలు వెలుస్తున్నాయి. నేరస్తులు ఒక్కోసారి వారి కదలికలు ఎవరూ గుర్తుపట్టడం లేదని సైలెంట్‌గా ఉంటారు. కొందరు వేరే ప్రాంతాల్లో నేరాలు చేసి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడకొచ్చి ఉంటారు. కొన్ని చోరీ కేసుల్లో సొత్తులు రికార్డుల్లేకుండా ఉంటాయి. అలాగే నేరాలు చేసేందుకు సన్నద్ధం వేళ నేరస్తుల కదలికలు అనుమానాస్పదంగా ఉంటాయి. వీటిని నిరోధించాలంటే ముందుగా నేరాలను తగ్గించేందుకు కార్డన్ సెర్చ్‌లు దోహదపడుతాయి. నిందితులు దొరికితే పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమవుతాయి.

సెర్చ్ ఇలా..

సెర్చ్ చేసేందుకు నేరాలు అధికంగా జరిగే, అసాంఘిక శక్తులు తలదాచుకునే ప్రాంతాలు, శివారు ప్రాంతాలను ఎంచుకుంటారు. తెల్లవారుజామున ఒకేసారి పోలీసు బలగాలు నిర్దేశిత ఏరియాలను చుట్టుముడుతాయి. ఎవరూ బయటకు వెళ్లకుండా, బయటి ప్రాంతాల నుంచి లోనికి రాకుండా చర్యలు తీసుకుని ఆ ప్రాంతాల్లో ప్రతి అణువు జల్లెడ పడుతారు. అక్కడున్న వాహనాలు, అనుమానిత వస్తువులు, ఇతర విషయాలపై ఆరా తీస్తారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలు స్వాధీనం చేసుకుంటారు. ఇంట్లో ఉన్న వ్యక్తుల వివరాలను సేకరిస్తారు. అనుమానాస్పదంగా ఎవరైనా ఉంటే అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలిస్తారు. అనంతరం వారిని పూర్తిస్థాయిలో విచారించి నేరాలకు సంబంధం లేదని తేలితే వదిలేస్తారు. నిందితులని తేలితే వారిని విచారిస్తారు. తనిఖీలు ముగిసిన అనంతరం తనిఖీ చేసినట్లు ప్రతి ఇంటికి ఓ స్లిప్ ఇస్తారు. రికార్డుల్లేని వాహనాలుంటే వాటిని కోర్టుకు అప్పగిస్తారు.

ప్రజలు సహకరించాలి

సెర్చ్ సమయంలో ప్రజలు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలి. వారి వద్ద ఉన్న గుర్తింపుకార్డులు, ఇంట్లో ఉన్న వారి వివరాలు, బంధువులు వస్తే వివరాలను తెలియజేయాలి. పోలీసులు వచ్చిన సమయంలో ఆందోళన చెందకుండా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వాలి. పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తుల సమాచారం తెలిస్తే వెంటనే తెలియజేయాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.


జేఈఈ మెయిన్స్‌లో 890వ ర్యాంకు



దయానా భారతి

గుడ్లూరు: జేఈఈ మెయిన్స్‌లో గుడ్లూరుకు చెందిన విద్యార్థిని పాదర్తి దయానా భారతి 890 ర్యాంకు సాధించింది. ఆమె కందుకూరులోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదవగా 983 మార్కులు వచ్చాయి. ఇటీవల జేఈఈ పరీక్ష రాయగా ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆలిండియా స్థాయిలో 890 ర్యాంకు పొందింది. దయానా భారతిని ఆమె తండ్రి సుబ్బారావు, కాలేజీ అధ్యాపక బృందం, గ్రామస్తులు ఆదివారం అభినందించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.80
సన్నవి	రూ.35
పండ్లు	రూ.25

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	రూ.172
లేయర్ (లైవ్)	రూ.110
బ్రాయిలర్ చికెన్	రూ.300
స్కిన్‌లెస్ చికెన్	రూ.330
లేయర్ చికెన్	రూ.187

నృసింహుని సంబరం ఆరంభం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు



స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

- ఊరేగింపుగా కోనకు చేరిన దేవదేవేరులు
- వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా అంకురార్పణ

పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణతో సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ముందుగా ఉగ్రరూపుడైన నృసింహుడిని నవ వరుడిగా ముస్తాబు చేసి గోనుపల్లె నుంచి ఊరేగింపుగా కోనకు తీసుకొచ్చారు. ఆదిలక్ష్మి.. చెంచు లక్ష్మి సమేతంగా పల్లకిపై కొలువుదీరిన శ్రీవారు మంగళవాయిద్యాల నడుమ పెనుశిల క్షేత్రం చేరుకున్నారు. వేడుకగా నిర్వహించిన స్నపన తిరుమంజన సేవలో సేదతీరారు. విశేష సంఖ్యలో భక్తులు దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాపూరు: పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గోనుపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవితో కలిసి స్వామి పెంచలకోనకు బయలుదేరారు. కొత్త అల్లుడు ఉభయనాంచారులతో కలిసి కోనకు చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ప్రధాన అర్చకులు పెంచలస్వామి, సీతారామయ్యస్వామి తెలిపారు.

ఊరేగింపుగా..

హిరణ్యకశిపుని వధానంతరం ఉగ్రరూపుడైన నృసింహ స్వామి వెలుగొండలలో సంచరిస్తుండగా చెంచురాజు (గిరిజన రాజు) కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించి ఆమెను వివాహమాడినట్లు పురాణాల్లో పేర్కొనబడింది. అప్పటి నుంచి గోనుపల్లె గ్రామంలోని ఉత్సవ విగ్రహాలకే పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏటా గోనుపల్లెలో పెంచల నరసింహస్వామి పెళ్లి కొడుకుగా ముస్తాబై కోనకు తరలివెళ్తారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం గోనుపల్లె నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా గిరిజనకాలనీకి తీసుకొచ్చారు. గిరిజనులు సంప్రదాయబద్ధంగా ఇంటి అల్లుడు, కుమార్తెకు (స్వామి, అమ్మవార్లకు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, సారపప్పు, పెడ మల్లెలు, బందారు ఆకులతో భాసికం, ఎల్లగడ్డలు, తంగేడుతో తాళిబొట్టు, స్వామివారికి కట్నంగా ఇచ్చే ఆరినార మొలతాడును సాంగ్యంగా చెల్లించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు పల్లకిలో ఊరేగుతూ పెంచలకోనకు చేరుకున్నారు.

వేడుకగా స్నపన తిరుమంజనం

కోనలోని క్రేన్ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు పాలు, తేనె, పెరుగు, చందనం, వివిధ పండ్ల రసాలు, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు.

అంకురార్పణతో శ్రీకారం

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. స్వామి నందనవనంలోని పుట్టమట్టిని తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ డీసీ సాగర్ బాబు, చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



స్వామికి గిరిజనులు కట్నంగా సమర్పించిన తేనె, గడ్డలు తదితరాలు



శ్రీవారికి అడవి గడ్డలు తీసుకొస్తున్న గిరిజనులు

చికిత్స పొందుతూ యువకుడి మృత్యువాత

ముత్తుకూరు: మండలంలోని పాదర్తిపాళెం గ్రామానికి చెందిన పి.రాజేష్‌రెడ్డి (21) శుక్రవారం డిగ్రీ పరీక్ష రాసి ఇంటికొస్తూ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై రాజేష్‌రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ క్రమంలో నగరంలోని ఓ ఆస్పత్రికి బాధితుడిని తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు.

ఉద్యోగావకాశం.. ఒక్క క్లిక్ దూరంలో..

- ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించిన ప్రభుత్వం
- ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా నూతన విధానం
- నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం



మోడల్ కెరీర్ సెంటర్

నెల్లూరు(మినీబైపాస్): యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంది. సాంకేతిక వ్యవస్థను వినియోగించి ఉపాధి కార్యాలయాల స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు అభ్యర్థులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి విద్యార్హతల వివరాలను నమోదు చేసుకునే వారు. అయితే ఉద్యోగాల సమాచారం తక్కువగా తెలిసేది. నేడు ఒక్క క్లిక్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా వెసులుబాటు వచ్చింది. ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. http:// www. employment. ap. gov. in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే చాలు. దీనిని నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు.

నమోదు చేసుకున్న తర్వాత..

రాష్ట్రంలోని ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీల వివరాలు, వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన నోటిఫికేషన్ల సమగ్ర వివరాలను పోర్టల్లో నమోదు చేసుకున్న యువతకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు. విద్యార్హతల ప్రకారం ఉద్యోగాల ఖాళీల గురించి ఫోన్ నంబర్‌కు, ఈ-మెయిల్‌కు పంపుతున్నారు. వీటితోపాటు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం అందిస్తూ అటు యువతకు, ఇటు సంస్థలకు వారధిలా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 33,652 మంది నమోదు చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉద్యోగావకాశాల వివరాలను యువతకు అందిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు వెబ్‌సైట్ ద్వారానే కల్పిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఉపాధి కార్యాలయ నంబర్ తప్పనిసరి అని నిబంధన ఉండేది. నెల్లూరు ఉపాధి కార్యాలయాన్ని యువత అవసరాలకు తగినట్లుగా రూ.46 లక్షలతో మోడల్ కెరీర్ సెంటర్‌గా తీర్చిదిద్దారు. కెరీర్ గైడెన్స్, ఎగ్జిబిషన్లు, ఔట్ రీచ్ ప్రోగ్రామ్స్, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు నిలయంగా ఇది మారింది.

వివరాలు నమోదు చేసుకోవాలి



యువత కోసం జాబ్ మేళాలను నిర్వహిస్తున్నాం. పదో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉత్తీర్ణులైన వారు ఎంప్లాయ్‌మెంట్ పోర్టల్లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు వారికి ఉద్యోగ సమాచారం అందుతుంది. ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను సమర్పిస్తే జిల్లా ఉపాధి కార్యాలయ అధికారులు ధ్రువీకరించి ఎంప్లాయ్‌మెంట్ నంబర్ కార్డు మంజూరు చేస్తారు. ఇవి మొబైల్ ఫోన్‌లో చేసుకోవచ్చు.

– కేవీ రామాంజనేయులు, జిల్లా ఉపాధి అధికారి